# నా జీవన బృందావనిలో...

A

అడల్ట్స్ ఓన్లీ కథ!

పావులూరి శివాజీ

ఎక్కడో మారు మూల్న... గుండె లోతుల్లో నిక్షిప్తమయిన విషాద జ్ఞాపకం అది. మనసు లోతుల్లో అణగారిన ఒకానొక కన్నీటి తుపాను...భాష తెలియని మూగవేదన. మనసులు కలిసి మనుషులు కలవని అపురూప ఆరాధన!


మా యిద్దరి వయసు పదమూడేళ్ళుంటుంది. ఇద్దరం ఒకటే స్కూలు. ఒకటే క్లాసు. బెంచీలు మాత్రం వేరు వేరు. ఆడపిల్లల్ని ముందు వరుస రెండు బెంచీల్లోను మగపిల్లల్ని వెనుకన కూర్చోబెట్టే వాళ్ళు. ఏ పూటయినా ఇద్దరాడపిల్లలు ఆబ్సెంటయితే టీచర్ చెప్పేది విన్పించటం లేదనో, బ్లాక్ బోర్డ్ కన్పించటం లేదనో కొంతమంది గడుగ్గాయిలు ఆడపిల్లల పక్కనే చేరటానికి పోటీ పడేవాళ్ళు.

నాకూ రెండు మూడుసార్లు ఆ ఛాన్సొచ్చింది. అందునా నా హృదయరాణి సౌమ్య పక్కనే. సౌమ్యంటే నాకు ప్రాణం. ఆమెకూ నేనంటే వల్లమాలిన ఇష్టం. ఇద్దరం నోట్‌బుక్‌లు ఇచ్చిపుచ్చుకునే వాళ్ళం. కారణం కల్పించుకుని మాట్లాడుకునేవాళ్ళం. ఒకళ్ళనొకళ్ళు చూసుకోకుండా, పలకరించుకోకుండా క్షణం కూడా వుండలేం.

ఓసారి సౌమ్యని చూడకుండా రెండ్రోజులు వుండాల్సొచ్చింది. ఆమె స్కూలుకి శలవు పెట్టింది. కారణం వెదికితే తనకు జ్వరం వచ్చిందని ఒకరిద్దరన్నారు. నా మనసు ఉండబట్టలేదు. అదేం ఆరాటమో ఆమెనా క్షణంలోనే చూడాల్పించింది. కానెలా..?

మా యింటికి రెండు వీధులు దాటి ఓ వీధి చివర్లో చెరువు కట్టకి దగ్గరగా వుంటుంది వాళ్ళిల్లు. అక్కడికే వెళ్ళి ఏదో పనున్న వాడిలా నిలబడితే..? ఒకట్రెండు సార్లు ఆమె యింటి ముందుగా నడవటం నన్ను చూస్తే బయటికి వస్తుంది. ఒకవేళ చూడకపోతే నడక దండగతోపాటు ఎవరికైనా అనుమానం వచ్చిందంటే, నా ఆత్మాభిమానం దెబ్బతిన్నట్టే. పల్లెటూరు కాబట్టి మనిషి మనిషిని పట్టించుకునే అలవాటు ఊళ్ళో జనానికుంది.

ఈ ఆలోచన కరెక్ట్ కాదనుకున్నాను. సమయానికి ఆచారి గుర్తుకొచ్చాడు. ఆచారి నాకు రెండేళ్ళు జూనియర్. అయినా కొంటె పనులు చెయ్యటంలో నాకంటే సీనియర్. వెంటనే అతడ్ని కలిసి ఏం చేద్దాం అన్నాను.



''నిన్ను చూస్తే ఆ అమ్మాయి బయటికొస్తుందన్నావుగా..'' అడిగాడు.

''అవును''

''మరి నీ పేరు వింటే..''

''ఎలాగైనా ఒకటే..''

''అయితే ఓ పని చేద్దాం. మనిద్దరం దొంగా, పోలీస్ ఆడదాం..సరిగ్గా వాళ్ళింటి దగ్గరకెళ్ళాక నువ్వు నాకు దొరక్కుండా రౌండ్లు తిరుగు.. ఏయ్ సతీష్! ఆగాగు..అంటూ నేను కేకలు పెడతాను. అప్పుడు నీ పేరు విని ఆ అమ్మాయి బయటికొస్తుంది'' అన్నాడు ఆచారి.

ఇదేదో బాగానే అన్పించింది. అయితే ఆచారి నాకంటే పరుగులో కూడా స్పీడు. అదే మానేజ్ చేశాను.

ఉత్సాహంగా ఆట మొదలు పెట్టాము. అప్పుడు రాత్రి సరిగ్గా ఏడు గంటలవుతుంది. వీధి దీపాలు లేవు. వీధులు కొట్టిన పిండి కాబట్టి ఎక్కడెక్కడి గుంతలు, మెరకలు మాకు కరతలామలకం.

మా పరుగు వేగం పుంజుకుంది. ముందు దొంగగా నేను, వెనుక పోలీస్‌గా ఆచారి.. సిని మాల్లో మల్లే ఛేజింగ్..సరిగ్గా సౌమ్య వాళ్ళింటి దగ్గరకెళ్ళాక..

సౌమ్య వాళ్ళ నాన్న బయట మంచం వేసుకు పడుకున్న సంగతి చీకట్లో తెలీలేదు. ఆ స్పీడులో నా మోకాలు ఆ మంచం కోడుకి గుద్దుకుని ఫెడేల్మంది. మంచానికి నాలుగడుగుల దూరంలో బోర్లాపడి అదృష్టవశాత్తు వెంటనే తేరుకున్నాను. వెనక నుంచి వచ్చిన ఆచారి పరిస్థితి మరీ ఘోరం.. ఏకంగా సౌమ్య వాళ్ళ నాన్న బొజ్జ మీద పడ్డాడు. తేరుకున్న ఆమె తండ్రి ఆచారిని మామూలుగా విడువలేదు.

## శిల్పా పట్టుదల

**కొన్ని కావాలంటే మరికొన్నిటిని వదులుకోవాలంటారు పెద్దలు. అయితే శిల్పాశెట్టి మాత్రం తనకి కెరీర్ ముఖ్యమని, కెరీర్‌ని పణంగా పెట్టి పెళ్ళి గురించి ఇప్పుడప్పుడే ఆలోచించేది లేదంటోంది. కొన్నిటికి కాలమే సమాధానం చెబుతుంది. అందుకే నేను పెళ్ళి పేరుతో తన కెరీర్‌ని పాడుచేసుకోవాలని అనుకోవడం లేదంటోంది. 'ఎప్పుడు పెళ్ళిచేసుకోవాలో తనకి తెలుసని చెప్పే శిల్పాలో చాలా పరిణతి కన్పిస్తోంది. మిగతా తారల్లా అకస్మాత్తుగా పెళ్ళిచేసుకుని అటు కెరీర్‌కి, ఇటు పర్సనల్ లైఫ్‌కి మధ్య అగాధం సృష్టించుకోవడం తన అభిమతం కాదని చెప్పే శిల్పాకి జీవితంపై ఎన్నో ఆశలున్నాయి. ఆ ఆశలన్నీ నిజం చేసుకోవడానికి ఎలాంటి శ్రమకైనా వెనుకాడేది లేదని ఘంటాపథంగా చెబుతోంది.**

అప్పటి నుంచీ ఆచారికీ, నాకూ మాటలు మృగ్యం.

★★★

స్కూలు నుంచి మా ఊరు చేరాలంటే మధ్యలో పాలెం దాటాలి. అప్పట్లో ఒకటి అరా ప్రైవేట్ బస్‌లున్నా లాంగ్ జర్నీ అయితే తప్ప వాటికి ప్రిఫరెన్స్ తక్కువ. ఒకరిద్దరికి సైకిళ్ళుండేవి. మిగతా అంతా కాలిబాటనే.

ఆడపిల్లలు గ్రూపులు కట్టి నడుస్తోంటే వాళ్ళకి ఫేవర్‌గా మా గ్రూపులు అనుసరించేవి. అలా నడవటంలో ఎన్నో తీపి జ్ఞాపకాలు.

వర్షం కురిసినప్పుడు మరింత ఆనందం. మబ్బులు ఫెళఫెళమన్నప్పుడు దారిన వుండే పెద్ద పెద్ద చెట్లని గ్రూపుల వారు కబ్జాలకి బలప్రయోగం జరుపుకునే వాళ్ళం. చెట్ల కొరకు బోల్డంత కాంపిటీషన్.

ఓరోజు మిట్ట మధ్యాహ్నం. లంచ్ బెల్ అయ్యింది. నాకు తలనొప్పిగా వుండటం చేత హెడ్ మాస్టారి దగ్గర పర్మిషన్ తీసుకుని ఇంటికి బయలుదేరాను. పాలెం వరకు ఒంటరిగా నడిచాను. అక్కడ చెరువుకట్టపైన చింతచెట్టు వుంది. అలసటగా అన్పించి దానికింద కాసేపు చతికిలపడదాం అని వెళ్ళాను.

ఆశ్చర్యం... ఒక్కక్షణం.

తేరుకున్నాక అమితానందం..

చెరువులో మెట్లమీద ఒంగి దోసిలితో నీళ్ళు తాగుతూ సౌమ్య! నన్ను చూసి భుజాన బ్యాగ్ సర్దుకుంటూ పైకి వచ్చింది.

''ఇక్కడున్నావేం..'' అంది.

నా సంగతి చెప్పి ''మరి నువ్వు'' అన్నాను.

''నాకూ కడుపు నొప్పిగా వుంటేనూ..'' అంది.

''ఇప్పుడెలా వుంది..?''

''ఫర్వాలేదు'' అని నన్ను అడిగింది.

ఆమె కలిసిన ఉత్సాహంతో అలసట మాయం అయ్యింది. ఆమెతో నడవటం చాలా హుషారుగా వుంది. తలనొప్పి ఎప్పుడో మర్చిపోయాను. స్కూల్లో సంఘటనల గురించి చెప్పుకున్నాం.

సర్కస్‌లో ఆ వైపు, ఈ వైపు ఆధారాలకి పొడవైన తాడు కట్టి ఆ తాడు పైన మనిషి నడవటం ఎంత సాహసం! అటువంటిదే ఇప్పుడు మేం నడుస్తున్న కాలిబాట కూడా.

అటు ఇటు దట్టమైన మొక్కజొన్న, కంది పొలాలు..మధ్యలో సన్నటి గట్టుకి రెండువైపులా ఏపుగా పెరిగిన పచ్చగడ్డి. ఆ గట్టు మీదనే మా నడక.

''గడ్డిలో పాములుంటాయేమో..'' అంది సౌమ్య భయంగా.

''అయితే నేను ముందు నడుస్తానుండు..'' అంటూ గొప్ప ధైర్యమున్న వాడిలా సాహసించాను. కానీ ఆ గట్టు దాటుకుని డొంకన పడేంత వరకు గుండె లబ్ డబ్ మనటం తెలుస్తూనే వుంది.

ఒంటరిగా వున్నప్పుడు ఆమెతో ఎన్నో విషయాలు మాట్లాడాలనుకుంటాను. తీరా ఆమె పక్కన చేరాక ఏవీ గుర్తుకు రావు.

క్రమంగా ఊరు దగ్గరవుతూంది. నాలో తెలీని బాధ మొదలయింది. మళ్ళీ ఇంత ఒంటరిగా ఆమె దొరక్కపోవచ్చు. అసలామెతో నేనేం మాట్లాడాలనుకుంటున్నాను? ప్రశ్న ఇరుకున పడేసింది.

ఒక్కసారిగా మేఘాలు భడభడమన్నాయి. అలా మేఘాలు గర్జిస్తే.. ''అర్జునా..కిరీటి..'' అనే అలవాటుంది. ఇద్దరం గొంతులు కలిపాము. ఈలోగా ఎక్కణ్నించో దబాటు వాన.. సూదులు గుచ్చినట్టు వచ్చిపడింది. ఇద్దరం పరుగెట్టుకుంటూ దగ్గర్లో జమ్మి చెట్టు కిందికి చేరాము.

అప్పటికే సగం తడిశాము. నా భుజాన వేలాడుతున్న పుస్తకాల బ్యాగ్ తీసి చెట్టు మొదట్లో వుంచాను. ఆమె కూడా తన బ్యాగ్ తీసి నా బ్యాగ్‌కి ఆనుకునేలా పెట్టడం గమనించాను.



ఆమే నన్ను స్పర్శించినట్టుగా ఏదో తెలియని అనుభూతి. నిజం! ఆ జడివానకి చెట్టు చినుకుల్ని ఆపి వుంచే పరిమాణం మేరకు ఇద్దరం ఆనుకునే నిలబడ్డాం. అది ఒంట్లో వేడో లేక భయమో తెలీదు..నాలో సన్నని వణుకు మొదలైంది.

చిన్నప్పట్నుంచి పరిచయం వున్నా ఆమెకు అంత దగ్గరగా నిలబడ్డం అదే మొదటిసారి. పుస్తకాల్లో చదివినట్టు, కవులు చెప్పినట్టు ఆమె ముఖం చంద్రబింబంలానే వుంటుంది. వర్షానికి తడిసిన నల్లని కురులు నుదురు మీదికి రింగులుగా జారి ఆమె అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి. చినుకు చుక్కలు ఆమె ముఖాన ఇబ్బందిగా అన్పిస్తున్నాయేమో..మాటి మాటికీ ఆమె భుజాలెత్తి బుగ్గల మీద తుడుచుకుంటోంది.

వర్షం మెరుగవుతున్న కొద్దీ ఆమె నాకు మరింత దగ్గరగా జరుగుతోంది. ఆమె తన ఎడమ అరచేతిని నా కుడి అరచేతిలోనికి జొనిపి బిగబట్టి నిలబడింది.

ఓ వైపు వర్షం తెచ్చిన చలి..మరో వైపు అంత సన్నిహితంగా ఆమె..గమ్మత్తయిన అనుభవం..అలా ఎంతసేపు గడిచిందో తెలీదు.

★ ★ ★

ఆడుతూ పాడుతూ సాగిపోతోంది బాల్యం.

స్కూలు ఫైనల్ పూర్తిచేశాము.

కాలేజీకి దగ్గర్లో వున్న సిటీలో జాయినయ్యాము.

## ఇషానవ్వులు

**'ఫలానా హీరోయిన్‌కి ఫలానా హీరోతో సంబంధాలున్నాయి' అంటూ పత్రికలు రూమర్లు సృష్టిస్తుంటాయి. కాకతాళీయంగా వీటిలో కొన్ని నిజమవుతాయి. ఇషాకొప్పీకర్ కూడా ఇప్పుడు ఇలాంటి రూమర్ల సుడిగుండంలో చిక్కుకుంది. ప్రియాంశు చటర్జీ, సునీల్‌శెట్టిలతో కలిసి తిరుగుతోందంటూ మీడియా రాస్తున్న వార్తల గురించి ప్రస్తావించినప్పుడు చిరునవ్వులు చిందిస్తోంది ఇషా. ఇలా ఉండగా అఫ్తాబ్ శివదాసానీకి ఇషాకి మధ్య ఏదో అనుబంధం పెనవేసుకుంటోంది అని కూడా రూమర్లు వచ్చాయి. 'ఇలాంటి వార్తలు నా కెరీర్‌కి ఎలాంటి ఆటంకాలు కల్గించవు. అలాంటప్పుడు టైం వేస్ట్ చేసుకుని పత్రికలకి వివరణ ఇవ్వడం నా పద్ధతికి విరుద్ధం. అన్నట్టు నాకు పబ్లిసిటీ అంటే పిచ్చిలేదు' అంటోంది.**

సౌమ్య మా కాలేజీలో జాయినవుతుందని ఆశపడ్డాను. అందుకు విరుద్ధంగా వాళ్ళ నాన్న ఉమెన్స్ కాలేజ్‌లో జాయిన్ చేశాడు. అప్పట్లో ఉమెన్స్ కాలేజీల దగ్గర జెంట్స్ తాకిడి తక్కువ నాలాంటి నలుగురైదుగురు తప్ప. నేను మాత్రం కాలేజీ ముందు తిష్టవేసేవాడ్ని కాను. కాలేజీకి, సౌమ్య వుండే రూమ్‌కి మధ్య తోవలో ఏదో పనున్నట్టు తిరిగే వాణ్ని సైకిల్‌మీద.

కాలం అలానే సాగుతూంది. ''ఇలా ఎంత కాలం అని!..నీ ప్రేమ విషయం ఆమెతో చెప్ప రాదూ..'' అని నా బాధ ఎరిగిన ఓ స్నేహితుడు ప్రోత్సహించాడు. ధైర్యం కూడగట్టుకుని ఓ తెల్లటి కాగితంపైన గుండ్రటి అక్షరాల్లో నా మనసు పరిచాను. దాన్ని నీట్‌గా కవర్ చేసి తిన్నగా సౌమ్య రూమ్‌కెళ్ళాను.

''సౌమ్యకి పెళ్లి నిశ్చయమైంది. ఆమెని కలవాలంటే మీ ఊరే వెళ్ళండి..!''

ఆమె స్నేహితురాలు అన్నది నిజమని గ్రహించటానికి, అది మింగుడు పడటానికి, అక్కడ్నించి నేను వెనుదిరగటానికి చాలా సమయం పట్టింది.



వెన్ను చీలింది. నాడులు కంపించాయి. మెదడు ఘోషించింది. హృదయం బ్రద్దలయింది. 'సౌమ్యా! నన్నెంత దారుణంగా మోసగించావు! ఇక నన్ను ఓదార్చటం ఎవరి వల్లనవుతుంది.' అనుకున్నాను. అవునుమరి! బాల్యంలో పడ్డ గాయం మచ్చగా మిగిలిపోవాలే తప్ప మాన్పు లేనిది కదా!

★ ★ ★

కాలగర్భంలో సంవత్సరాలు గడిచిపోయాయి. నా డిగ్రీ పూర్తయింది. ఉద్యోగంలో సెటిలవటంతోనే మారేజ్ అయ్యింది.

సరిగ్గా సౌమ్య వాళ్ళ చిన్నాన్న కూతురే నా భార్య కావటం కాకతాళీయం.

నా సతీమణి నాతో బాగా కలిసిపోయింది. అవసరమైన విషయాలు వెన్నుతట్టి ప్రోత్సహించటంలోను, అనవసరమైన విషయాలు టేకిటీజీ అనుకోటంలోను ఆమెకు సాటి మరెవ్వరూ వుండరు.

ఆరోజు రాత్రి చాలా కూల్ వాతావరణంలో భోజనం వడ్డిస్తూ అన్నది..''మీరు మహామొద్దు'' అని.

''ఏం..!?'' అన్నాను ముద్ద నోట్లో కుక్కుకుంటూ.

''మీకు తోటివారి మనసును తెలుసుకోవటంలో ఏమాత్రం చొరవలేదు''

''నీ విషయంలో ఏదైనా లోటు చేస్తున్నానా..'' అడిగాను అర్థంకాక.

''నా విషయంలో కాదు! మా అక్క సౌమ్య విషయంలో..'' ఆమె వంక షాకింగ్‌గా చూశాను.

''నిజం! వేసవి శలవుల్లో అక్క మా ఊరు వచ్చిన ప్రతీసారి మీ గురించే చెబుతుండేది. ఆ మటుకు ఇద్దరం కష్టపడి మీకో లవ్ లెటర్ కూడా తయారుచేశాము. పాపం మీకివ్వటానికి అక్కకి ధైర్యం చాల్లేదు. చదూకునే రోజుల్లో మీరేదో పనున్నవాడిలా అక్కకోసం కాలేజీ చుట్టూ, రూమ్ చుట్టూ చక్కర్లు కొడుతూండేవారట కదా. ఏదో సందర్భం చూసి చొరవ చూపుండాల్సింది. మీ నుంచి రెస్పాన్స్ ఎలా వుంటుందోనని, వాళ్ళ నాన్న చూసిన సంబంధం కాదనే ధైర్యం లేక తలవంచింది.

అయినా మీ యిద్దరి పెళ్లి కూడా కష్టమేలెండి. ఒకే ఏజ్‌లో వున్నా, మగవాళ్ళు 'స్థిరత్వం' ఏర్పరచుకునేప్పటికి ఆడవాళ్ళు రూపాలు ఎదిగి దాటిపోతారు. టేకిటీజీ..'' ఫినిషింగ్ టచ్ ఇచ్చింది.

సౌమ్య జ్ఞాపకాలు నా కళ్ళల్లో లీలగా మెదిలాయి. హృదయమే పొడారిందో లేక గుండె కొట్టుకోవడం క్షణకాలం స్తంభించిందో..చేతలు డిగి నిర్జీవం అయ్యాను.

☆